క్లుప్తంగా

కేదారిలంకలోనే గ్రామసభ నిర్వహించాలి


యర్రంశెట్టి నాగేశ్వరరావు

కపిలేశ్వరపురం: మండల కేంద్రానికి సుదూరాన లంక గ్రామంగా ఉన్న కేదారిలంకలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించాలని గ్రామ ఎంపీటీసీ సభ్యుడు యర్రం శెట్టి నాగేశ్వరరావు అధికారులను డిమాండ్ చేశారు. రెవెన్యూ గ్రామాల పరిధి పేరుతో గ్రామసభలను నిర్వహించడం సరికాదని, భౌగోళిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కేదారిలంక గ్రామస్తులను నవంబర్ 2న కపిలేశ్వరపురంలో నిర్వహించ తలపెట్టిన గ్రామసభకు హాజరు కావాలని చెప్పడం సరికాదన్నారు. గోదావరి అవతలి గట్టున ఉన్న కేదారిలంక గ్రామస్తులను ఇవతల గట్టున ఉన్న కపిలేశ్వరపురానికి రమ్మని చెప్పడంపై అధికారులు పునరాలోచించాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

75 కేజీల ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర రూ.1725


వెల్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర 75 కేజీల బస్తాకి రూ.1725 ప్రకటించిందని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని వెల్ల, కాపవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ త్వరలో మండలంలోని ప్రతి రైతు సేవా కేంద్రంలోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. రైతులకు అదనంగా హమాలీ, రవాణా ఖర్చులను ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. అదే విధంగా ధాన్యం రైసు మిల్లులకు చేరవేసే ట్రాక్టర్లకు జీపీఎస్ పరికరాలు తప్పనిసరని సూచించారు. రైతులు తమ ధాన్యం 17 శాతం లోపు తేమ ఉండే విధంగా ఆరబెట్టుకోవాలని సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు వీరబోయిన సూరిబాబు, యనమదల మంగాదేవి, ఎంపీటీసీలు చిక్కాల స్వామికాపు, మంచెం దేవి, రెడ్నం సతీష్, వీఏఏ సత్యనారాయణ, వీఆర్‌ఓ ఏసురత్నం, వీహెచ్‌ఏలు సుధీర్, నరేంద్ర, సురేష్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో పొలం పిలుస్తోంది


కేదారిలంకలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ తదితరులు

కపిలేశ్వరపురం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా వ్యవసాయ, అనుబంధ శాఖలు కృషి చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది పేరిట రైతు సదస్సు నిర్వహించారు. ఆయా పంచాయతీల సర్పంచులు వీధి వెంకటరెడ్డి, నాతి గవరయ్య అధ్యక్షతన నిర్వహించిన సదస్సుల్లో వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు. ఏఓ రమేష్‌కుమార్, సచివాలయ ఉద్యాన సహాయకులు మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నూతన కౌలుదారీ చట్టంలోని అంశాలను వివరించారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం


ర్యాలీ చేస్తున్న కృత్తివెంటి డిగ్రీ కళాశాల విద్యార్థులు

రామచంద్రపురం: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని స్థానిక కృత్తివెంటి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు కె.రవిబాబు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలను వివరించారు. అనంతరం ప్రధాన రహదారిలో జాతీయ ఐక్యతను వివరిస్తూ ర్యాలీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీన్ రివర్స్..

- ఆక్రమణల్లో మళ్లీ కట్టడాలు
- చోద్యం చూస్తున్న దేవదాయ శాఖ అధికారులు


దేవదాయ శాఖ కూల్చేసిన స్థలంలోనే తిరిగి చేపట్టిన నిర్మాణం

రామచంద్రపురం: 'ఈ స్థలం దేవదాయ శాఖది.. అక్రమ కట్టడాలు కట్టేశారు మీరు, తొలగించకపోతే మేమే కూల్చేస్తాం' అంటూ నోటీసులు ఇచ్చి కూల్చేసిన దేవదాయ శాఖ అధికారులు. అదే స్థలంలో తిరిగి నిర్మాణాలు చేస్తుంటే చోద్యం చూస్తున్నారు. ఇదేం విడ్డూరం అంటూ మిగిలిన వారు ఆ శాఖ అధికారులను నిలదీస్తే చూస్తాం, చేస్తాం అంటూ నీళ్లు నములుతున్న వైనం కె.గంగవరం మండలం కోటిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే. కె.గంగవరం మండలం కోటిపల్లి చాయా సోమేశ్వర స్వామివారి దేవస్థానానికి సుమారు 9.50 ఎకరాల చెరువు ఆలయం ఎదురుగానే ఉంది. దీని చుట్టూ దేవస్థానానికి చెందిన భూమి కూడా ఉంది. చెరువును ఆనుకుని కొన్ని కుటుంబాలు ఏళ్ల తరబడి నివాసం ఉంటున్నారు. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుమారుగా నెల రోజుల క్రితం చెరువును ఆనుకుని ఉన్న రెండు ఇళ్ల వారికి దేవదాయ శాఖ నోటీసులు జారీ చేసింది. హడావుడిగా తెల్లవారుజాము సమయంలో తెల్లవారక ముందే మందీ మార్బలంతో వెళ్లి దేవదాయ శాఖ స్థలంలో ఇల్లు ఉందంటూ ఓలేటి లక్ష్మి అనే మహిళ ఇంటిని పూర్తిగా కూల్చేశారు. పక్కనే ఉన్న మసకపల్లి నూకరాజు ఇంటి గోడను మాత్రం పాక్షికంగా కూల్చారు. మా ఇల్లు గ్రామ కంఠంలో ఉందని, ఇందేంటి మా ఇంటిని కూల్చేస్తున్నారని అప్పుడే అక్కడకు వచ్చిన అధికారులను ఓలేటి లక్ష్మి నిలదీస్తే ఇదంతా దేవస్థానానికి చెందుతుందని బుకాయిస్తు అడ్డుగా ఇంటి వద్ద తన ఇద్దరు కుమారులతో కూర్చున్నా పక్కకు ఈడ్చేసి మరీ ఇంటిని కూల్చేశారు. కానీ పక్కనే ఉన్న మసకపల్లి నూకరాజు ఇంటిని పాక్షికంగానే తొలగించారు. గ్రామంలో ఇళ్లలో పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్న నిరుపేద ఓలేటి లక్ష్మిపై కక్ష సాధింపుతోనే ఇంటిని కూల్చేశారని గ్రామస్తులు ముక్కుమీద వేలేసుకున్నారు. దేవస్థానికి చెందిన చెరువు చుట్టూ చాలా ఆక్రమణలు ఉన్నప్పటికి వాటిని మాత్రం దేవదాయ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవండం లేదని విమర్శిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తొలగింపులు

సాధారణంగా దేవదాయ శాఖకు చెందిన స్థలాలు ఆక్రమణకు గురైతే, ముందుగా సర్వే చేయించి వాటిని స్వాధీనం చేసుకోవాలి. రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో సర్వే నిర్వహించి ఆక్రమణలకు గురైన వాటిని గుర్తించి వారికి నోటీసులు అందించి తొలగించుకోమని లేని పక్షంలో చర్యలు తీసుకోవాలి. కానీ ఇవేమీ లేకుండానే గతంలో అన్యాయంగా గ్రామ కంఠంలో ఉందని చెబుతున్న ఓలేటి లక్ష్మి ఇంటిని నిర్దాక్షిణ్యంగా కూల్చేసి వారి కుటుంబాన్ని వీధిన పడేశారు.

పట్టించుకోని అధికారులు

ఇదిలా ఉంటే తాజాగా గతంలో దేవదాయ శాఖ కూల్చేసిన స్థలంలోనే తిరిగి మసకపల్లి నూకరాజు కుటుంబీకులు నిర్మాణాలు చేస్తున్నా, దేవదాయ శాఖ అధికారులు కిక్కురుమనకుండా చోద్యం చూస్తున్నారు. గతంలో దేవదాయ శాఖ భూమి అంటూ చెప్పి తొలగించిన కట్టడాల వద్దే తిరిగి నిర్మాణాలు చేస్తున్నా స్థానికంగా ఉండే దేవదాయ శాఖ అధికారులు చూసీచూడనట్లే వ్యవరిస్తున్న తీరు విమర్శలకు దారి తీసింది. నిరుపేదల ఇంటిని కూల్చేస్తే వీధిన పడిన కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహిస్తున్న తీరుతో స్థానికులు విస్తుపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దేవదాయ శాఖ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డున పడేశారు



గత 15 ఏళ్లుగా ఉంటున్న మా ఇంటిని అన్యాయంగా కక్ష సాధింపుతో కూల్చేశారు. కష్టపడి పనిచేసుకుంటూ పిల్లల్ని పోషించుకుంటున్నా మమ్మల్ని రోడ్డున పడేశారు. మా ఇంటి స్థలం గ్రామ కంఠంలో ఉందని చెబుతున్నా వినలేదు. చెరువు చుట్టూ ఆక్రమణలు ఉన్న వాటిని తొలగించకుండా కేవలం మా ఇంటిని మాత్రమే కూల్చేశారు. గతంలో ఆక్రమణలని తొలగించిన స్థలంలోనే మళ్లీ మరొకరు నిర్మాణాలు చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.
– ఓలేటి లక్ష్మి, కోటిపల్లి

చర్యలు తీసుకుంటాం

దేవదాయ ఆక్రమణల్లో కూల్చిన కట్టడాల స్థానే పునః నిర్మిస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. దీనిపై విచారించి విషయం నిజమైతే సంబంధిత అధికారులతో సంప్రదిస్తాం. సంప్రదింపుల అనంతరం చర్యలు తీసుకుంటాం.
– జి.భీమశంకరం, ఈఓ, ఛాయా సోమేశ్వరస్వామి దేవస్థానం

ఆర్టీసీ అదనపు బాదుడుపై అధికారుల చర్యలు

సాక్షి ఇంపాక్ట్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో పార్శిల్ కౌంటర్‌లో అదనపు సొమ్ములు వసూలు చేస్తున్నారంటూ ఈ నెల 22 న 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఆర్టీసీ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ మాధవ్ పార్శిల్ కౌంటర్‌లో అదనపు వసూళ్లకు పాల్పడిన యువకుడికి జరిమానా విధించామన్నారు. అంతే కాకుండా అదనంగా వసూలు చేసిన సొమ్మును వినియోగదారుడనికి ఫోన్ పే చేయించామన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు 15 వరకూ గడువు

మండపేట: బీజేపీ సభ్యత్వ నమోదు గడవును పొడిగించినట్టు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొంతకాలంగా మండపేట నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు సాగిస్తున్నామన్నారు. అయితే నమోదును ఈ నెల 31తో ముగించాల్సి ఉండగా తాజా రాష్ట్ర బీజేపీ పెద్దల పిలుపు మేరకు నవంబర్ 15 వరకూ గడవును పొడిగించామని తెలిపారు.

బాణసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలి


ఏడిద రోడ్డులో దీపావళి దుకాణదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామకృష్ణ


రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రామకృష్ణ


గొల్లపాలెంలో మాట్లాడుతున్న ఎస్సై మోహన్‌కుమార్

- రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ
- దుకాణదారులతో సమావేశం

మండపేట: ఏడిద గ్రామంలో సోమవారం సంభవించిన బాణసంచా పేలుడు ఘటనను దృష్టిలో పెట్టుకుని టపాసుల దుకాణాల ఏర్పాటు విషయంలోను, తయారీ కేంద్రాల వద్ద నిబంధనలను మరింత కఠినతరం చేశామని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ చెప్పారు. పట్టణంలోని ఏడిద రోడ్డు పాపమ్మ పేరంటాలమ్మ గుడి పక్కనే గల ఖాళీ ప్రదేశంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇచ్చారు. మంగళవారం మండపేట రూరల్ సీఐ పితల దొరరాజుతో కలసి డీఎస్పీ రామకృష్ణ వెళ్లి ఈ దుకాణాల సముదాయాన్ని పరిశీలించారు. షాపుల నిర్వాహకులతో సీఐ దొరరాజు అక్కడే అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డీఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ దుకాణదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. ప్రతి దుకాణదారుడు ఈ మూడు రోజులూ అప్రమత్తంగా ఉంటూ వ్యాపారం సాగించాలన్నారు. మండపేట పట్టణానికి ఇదొక్కటే బాణసంచా దుకాణ సముదాయం అయినందున వేలాది మంది ప్రజలు ఇక్కడికే వచ్చి టపాసులు ఖరీదు చేస్తారన్నారు. వారి భద్రతను దృష్టిలో పెట్టుకుని పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వ్యవహరించాలన్నారు. సమావేశంలో టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి, అగ్నిమాపక అధికారి హనుమంతరావు, ఏఎస్ఐ చిన్నారావు, తాత్కాలిక దుకాణదారులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు

రాయవరం: బాణసంచా తయారీదారులు, విక్రేతలు నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని రాయవరం, వి.సావరం బాణసంచా తయారీ కేంద్రాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం లైసెన్స్‌లు ఉన్నాయా? లేదా? తయారీ కేంద్రాల్లో పాటిస్తున్న భద్రతా చర్యలపై ఆయన క్షేత్ర స్థాయిలో తనిఖీలు జరిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో తయారీలు చేపడుతున్నారా? అనే విషయాన్ని రెండు కేంద్రాల్లో ప్రత్యక్షంగా పరిశీలించారు. నిబంధనలను కచ్చితంగా పాటించాలని బాణసంచా తయారీ కేంద్రాల యజమానులు వెలు గుబంట్ల వీరవెంకట సత్యనారాయణమూర్తి, వేల్పూరి లోవరాజులకు సూచించారు. ఆయన వెంట మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, రాయవరం ఎస్సై పి.బుజ్జిబాబులు ఉన్నారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

కాజులూరు: బాణసంచా దుకాణాల ఏర్పాటులో ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నిబంధనలు వ్యాపారులు కచ్చితంగా పాటించాలని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సై మోహన్‌కుమార్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పర్యటించి బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించి వ్యాపారులకు తగు సూచనలు చేశారు. గొల్లపాలెంలో ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించినా, నిబంధనలు అతిక్రమించి సరకు నిల్వలు ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులు అమ్మకాల సమయంలోనూ ప్రతి దుకాణం ముందు 500 లీటర్ల నీరు, ఒక బకెటు ఇసుక, ఒక బకెటు నీరు సిద్ధంగా ఉంచుకోవాలని, దుకాణానికి దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలన్నారు. మంటలను అదుపుచేసే డీసీపీ కెమికల్ పౌడర్ ఒక సిలిండర్ ఉండాలని, అలాగే దుకాణాల వద్ద పెద్ద ఎత్తున బాణసంచా ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిమితి ప్రకారం బాణసంచా తరలించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


శలపాక రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డీటీ శ్రీనివాసరావు


వాకతిప్ప రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

కాజులూరు: సమగ్ర భూ సర్వేపై మండల గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల డిప్యూటీ తహసీల్దార్(డీటీ) ముమ్మిడివరపు శ్రీనివాసరావు అన్నారు. శలపాకలో మంగళవారం స్థానిక వీఆర్వో గనికమ్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీటీ మాట్లాడుతూ మండల గ్రామాల్లో గత ఏడాది రెవెన్యూ సిబ్బంది సమగ్ర భూ సర్వేపై నిర్వహించామన్నారు. దీనిపై నవంబరుర్ 19వ తేదీ మంగళవారం వరకూ మండలంలో రోజుకు ఒక్క గ్రామం చొప్పన గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి పేర్ల నమోదు తదితర అంశాలపై అభ్యంతరాలు ఉంటే నమోదు చేసుకుని సరిచేస్తారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వి.వేగేశ్వరరావు, మండల సర్వేయర్ ఎంవీఎస్ఎస్ మూర్తి, గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

వాకతిప్పలో..

కపిలేశ్వరపురం: భూ యాజమాన్య హక్కుల్లో సాంకేతిక సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు అన్నారు. మండలంలోని వాకతిప్పలో మంగళవారం భూముల రీసర్వే గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కొరిపెల్ల వెంకట నాగ ప్రవంతి అధ్యక్షతన నిర్వహించిన సభలో రెవెన్యూ అనుబంధ శాఖల అధికారులు రైతుల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలోగా దరఖాస్తుల్లో పేర్కొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కుంచె ప్రసన్నకుమార్, గ్రామ రైతులు, భూ యజమానులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

టపాకాయలు తయారు చేస్తున్న మహిళపై కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేటలో సాదే కాంతమ్మ తాటాకు టపాకాయలు తయారు చేస్తుందన్న ఎస్సైకు సమాచారం అందింది. దాంతో అక్కడకు వెళ్లి పరిశీలించిన ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆమె నుంచి 250 తాటాకు టపాకాయలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఆయన విలేకరులకు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ


ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయవరం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి మండలస్థాయిలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాప్తార్ పథకంలో భాగంగా ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది గ్రామ వ్యవసాయ సహాయకులు, ధాన్యం కొనుగోలు సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, హెల్పర్స్, గ్రామ రెవెన్యూ అధికారులు, సొసైటీల సీఈవోలకు ఈ శిక్షణ ఇచ్చారు. ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల విధివిధానాలను రైతులందరికీ తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. ధాన్యానికి మద్దతు ధర 75 కేజీల బస్తాకు సాధారణ రకానికి రూ.1725, ఏ గ్రేడ్ రకాలకు రూ.1740లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటేనే మద్దతు ధర లభిస్తుందన్నారు. ముఖ్యంగా తేమ 17 శాతం లోపు ఉండాలన్నారు. ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర రైతులందరికీ అందే విధంగా, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం మండల వ్యవసాయాధికారి జె.మనోహర్ మాట్లాడుతూ ప్రతి రైతు సేవ కేంద్రంలో గోనె సంచులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, అవసరమైన రిజిస్టర్లను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ మండల టెక్నికల్ అసిస్టెంట్ శివకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు ఐ.సంధ్య, వ్యవసాయ విస్తరణాధికారి ఎ.శివశంకర్, మండలంలోని 19 రైతు సేవా కేంద్రాల ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన రహదారిని విస్తరించరూ...

- ఇరుకు రహదారితో ఇబ్బందులు
- కపిలేశ్వరపురం–అంగర రహదారిపై సమస్యలు


విస్తరణకు నోచుకోని కపిలేశ్వరపురం–అంగర రహదారి

కపిలేశ్వరపురం: మండల కేంద్రమైన కపిలేశ్వరపురం – అంగర ఆర్ అండ్ బీ రహదారిని విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. మండపేట నుంచి అంగర వరకూ గల రహదారిని 2016లో విస్తరించారు. అంగర గ్రామ శివారు నుంచి కపిలేశ్వరపురం నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న రహదారి విస్తరణ పనులు అప్పట్లో నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఇసుక, ఇటుక, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను తరలించే వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో త్వరితగతిన విస్తరణ పనులను చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారి నిర్మాణ పనుల నేపథ్యమిదీ..

2016లో కపిలేశ్వరపురం– మండపేట రహదారి విస్తరణ పనులు చేపట్టారు. 16.2 కిలోమీటర్లు మేర 3.5 మీటర్లు వెడల్పున ఉన్న రహదారిని ఏడు మీటర్లకు వెడల్పు చేసేందుకు అప్పట్లో రూ.16.03 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 11కిలో మీటర్లు మేర తారు, 3.2 కిలోమీటర్లు మేర సీసీ రోడ్డు గానూ మెరుగుపరిచారు. నిధుల సర్దుబాటు కారణంగా 14.2 కిలోమీటర్ల మేరకు మాత్రమే పనులు చేపట్టారు. దీంతో 1.7 కిలోమీటర్ల మేర కపిలేశ్వరపురం–అంగర రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. మండల కేంద్రం కావడంతో ఈ రహదారిపై అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. త్వరితగతిన రహదారిని విస్తరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ ప్రధాన రహదారితో పాటు మండలంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. అంగర, వెదురుమూడి, వెదురుమూడి మండపేట, వెదురుమూడి – సంధిపూడి రహదారుల ఛిద్రమై లోతైన గుంతలు పడి ఉన్నాయి.

ఊరూవాడా దీపావళి సందడి

- ప్రధాన కూడళ్లలో వెలసిన బాణసంచా దుకాణాలు
- నింగినంటిన ధరలు
- సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో నిరాశ

రాయవరం: చీకటిని పారదోలి వెలుగులు నింపే పండుగ దీపావళి. క్లస్టర్ పరిధిలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లోని 120 గ్రామాల్లో దీపావళిని ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బాణసంచా విక్రయాలకు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. షాపుల ఏర్పాటుకు అవసరమైన అనుమతి కోసం ఇప్పటికే తహసీల్దారు కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు.

అంతగా కనిపించని హడావుడి

దీపావళి పర్వదినానికి మరో రోజు మాత్రం మిగిలి ఉండగా, మంగళవారం ఆయా గ్రామాల్లో బాణసంచా దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. వాతావరణం అనుకూలించడంతో వ్యాపారులు బాణసంచా బాగానే వ్యాపారం జరుగుతుందనే భరోసాతో ఉన్నారు. మండపేట మండలంలోని ఏడిద గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న బాణసంచా పేలుడు నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. బాణసంచా అమ్మకాలు, తయారీదారులతో మంగళవారం సమావేశాలు నిర్వహించి, హెచ్చరికలు జారీ చేశారు. ఎక్కడికక్కడ అధికారులు ఆంక్షలను కఠినతరం చేశారు. నిబంధనలు పాటించని వ్యాపారుల తాత్కాలిక లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి కోతలు పూర్తిగా ప్రారంభం కాకపోవడంతో కూలీలకు పనులు ఆడడం లేదు. ఈ పరిస్థితుల్లో సామాన్య, మధ్య తరగతి ప్రజలు పండుగను జోరుగా జరుపుకోవడం కష్టమని పలువురు పేర్కొంటున్నారు. మరోపక్క బాణసంచా ధరలు ఆకాశాన్ని అంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యులకు దీపావళి నిరాశను మిగల్చనుంది.

పాఠశాలల్లో హరిత దీపావళి

దీపావళి పర్వదినం నేపథ్యంలో బుధవారం పలు పాఠశాలలు ఆప్షనల్ హాలీ డే ప్రకటించుకున్నాయి. దీంతో చాలా పాఠశాలల్లో మంగళవారం పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు హరిత దీపావళి నిర్వహించారు. దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. బాణసంచా కాల్చేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు.

జాగ్రత్తలు పాటించాలి

టపాసులు కాల్చేటపుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. పేలుడు పదార్థాలకు వారిని దూరంగా ఉంచాలి. మిగిలిన బాణసంచా సామగ్రి కూడా పెద్దలు దగ్గరుండి చిన్నారులతో కాల్పించాలి. టపాసులు కాల్చే సమయంలో విధిగా చెప్పులు, కాటన్ వస్త్రాలు ధరించాలి. నీళ్లను అందుబాటులో ఉంచుకోవాలి.

నిబంధనలు పాటించాలి



బాణసంచా వ్యాపారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. బాణసంచా దుకాణాలను నిర్దేశించిన స్థలాల్లోనే అమ్మకాలు చేపట్టాలి. ప్రమాదం జరగకుండా అవసరమైన భద్రతా చర్యలను అనుసరించాలి. చిన్నపాటి నిర్లక్ష్యాన్ని కూడా సహించేది లేదు. ఇళ్లల్లో బాణసంచా సామగ్రి నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బాణసంచా నిల్వలు గుర్తిస్తే చుట్టుపక్కల వారు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. సమాచారం ఉంటే నేరుగా 94407 96537 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు లేదా 112 నంబరుకు సమాచారం ఇవ్వాలి.
– పి.దొరరాజు, సీఐ, మండపేట రూరల్ మండలం

ఉద్యాన పంటలపై విద్యార్థులకు అవగాహన

అయినవిల్లి: ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఉద్యానవన పంటలపై ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. అంబాజీపేట వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి విధానాలు చేపట్టి వ్యవసాయాన్ని కాపాడుకోవాలన్నారు. అగ్రికల్చర్ ఒకేషనల్ ట్రైనీ కుమారి, ఎల్.కమలప్రియ సారథ్యంలో అంబాజీపేట వైఎస్సార్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. కొబ్బరి, కోకో పంటల పెంపకం, మొక్కలు పెరగడానికి ఎలాంటి వాతావరణం, ఎలాంటి సేంద్రియ ఎరువులు వాడాలి, మిత్ర పురుగుల పెంపకం వంటి అంశాలపై వివిధ పద్ధతులను విశదీకరించారు. విద్యార్థులు తమకున్న సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి నిడదవోలు మండలం మునిపల్లికి చెందిన దొడ్డపనేని భారతి వారి కుటుంబ సభ్యులు మంగళవారం రూ.20,100 అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు వినాయకరావుకు అందజేశారు. దాతకు అర్చకులు ఆశీర్వచనం అందజేసి, స్వామి శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటం అందజేశారు. దాతను పలువురు అభినందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి వైద శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డీసీహెచ్ పాపారావు ఆధ్వర్యంలో అమలాపురం ఎల్‌సీఎంఐ కేర్ సౌజన్యంతో కంప్యూటర్ ఆధారిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు ప్రారంభించారు. ఎల్‌సీఎంఐ కేర్ టెక్నీషియన్స్ నగేష్, నిర్మల, కుమారి కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో పలువురికి కంటి చూపులో లోపాలు, పలు రుగ్మతలు గుర్తించి, వైద్య సలహాలు, సూచనలు ఇచ్చారు. అవసరం మేరకు ఉచితంగా మందులు, ఐ డ్రాప్స్ ఇచ్చారు.